# సర్కార్ అందుబాటులోకి తెచ్చిన వైద్య సేవలేంటి..?



వరంగల్, జులై 16,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే. వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం (జూమ్) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ద్వారా వైద్యులకు వివిధ రకాల ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు నిర్వహించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ శాతం ఆపరేషన్ లేకుండా నార్మల్ డెలివరీలు జరిగేలా కృషి చేయాలని డాక్టర్లకు సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు ఆశ్రయించిన బాధితులకు ఆర్థిక భారం తప్పదని చెప్పుకొచ్చారు. అందుబాటులో ఉన్న సర్కార్ ఆసుపత్రిలో వైద్య సేవలు పొంది, ఆదాయాన్ని పొదుపు చేసుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాలవారీగా వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ, వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. వరంగల్ జిల్లా పరిధిలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య నిర్వాహకులు ఎక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలు లేవు. జిల్లా పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులు అనేకంగా ఏర్పడ్డాయి. ఇలాంటి సందర్భాలపై అనేకసార్లు వార్త కథనాలు వెలువడిన సంగతి విధితమే. ఇలాంటి పరిస్థితుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పట్టింపు చేయడం లేదని, అందువల్లే నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

### మెరుగైన వైద్య సేవలు ఏంటి..?

వరంగల్ జిల్లా రూరల్ పరిధిలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వం ప్రజల పరిరక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన మెరుగైన వైద్య సేవలు ఏంటన్న విషయం చర్చగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించిన వారికి జ్వరం, దగ్గు, జలుబు సంబంధిత వ్యాధులకు మాత్రమే మందులు ఇచ్చి పంపిస్తున్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలవారీగా ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉప కేంద్రాలకు చెందిన నిర్వాహకులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందజేస్తున్న జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలకు మాత్రమే మాత్రలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అనేకమంది గ్రామీణ ప్రాంతాల ప్రజలు పిహెచ్ సి, సిహెచ్ సి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. అందువల్ల దినదినాభివృద్ధి చెందినట్లు ప్రైవేట్ ఆస్పత్రులు పుట్టుకొస్తూనే ఉన్నాయి.

### అనారోగ్య సమస్యతో ప్రజలపై ఆర్థిక భారం

మొట్టమొదటిగా ప్రతి వ్యక్తికి ఆరోగ్యం బాగున్నప్పుడే అతని కుటుంబం బాగుంటుంది. అలాంటి వైద్య సేవలు మెరుగైన స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజా పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించాలని వరంగల్ జిల్లా పరిధిలో ప్రజలు కోరుతున్నారు. స్కానింగ్, ఎక్స్రేలు, రక్త, మూత్ర పరీక్షలు చేస్తేనే అనారోగ్య సమస్య ఏంటి అన్న విషయం బయటపడుతుంది. అప్పుడు సమస్యకు తగిన మందులు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఫలానా పరీక్షలు చేయించుకుని రావాలంటూ ప్రభుత్వ వైద్యులే వరంగల్, హనుమకొండ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అందుకు నిదర్శనంగా వరంగల్, హనుమకొండ నగరాల్లో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబులు, డయాగ్నస్టిక్స్ సెంటర్లు బాధిత వర్గాలతో కిటకిటలాడుతున్నాయి. వైద్య సేవల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులు బాధిత వర్గాలను పట్టి పీడిస్తూ, అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నాయి. ఇప్పటివరకు పర్మిషన్ లేని ఆసుపత్రిలో అనేకం ఉన్నప్పటికీ, జిల్లా యంత్రాంగం అలాంటి ఆసుపత్రులపై ఎందుకు పర్యవేక్షణ చేయడం లేదన్న విషయమై ప్రశ్నార్థకమైంది. వరంగల్ జిల్లా పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రులలో ఇలాంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్న విషయమై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన లోపం వారి ఆర్థిక నష్టానికి మరో కారణమైంది. అనారోగ్య సమస్యతో ఆసుపత్రులను ఆశ్రయించే వారికి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రుల వారిగా వైద్య సేవల పట్ల బాధితులకు అవగాహన కల్పించే విధంగా సర్కార్ వైద్యులే చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వైద్య వ్యవహారంపై జిల్లా వ్యాప్తంగా డిఎంహెచ్ఓ అధికారి ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.

# ఐనవోలు మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



ఐనవోలు, జులై 16,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండలంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కించారు. దేవాలయ కార్య నిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం తేదీ. 28.03.2024 నుండి తేది.16.07.2024 వరకు (109 రోజులకు) హుండీ ఆదాయాన్ని లెక్కించగా 24,93,422 రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వివిధ టికెట్స్ ద్వారా 90,77,405 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. హుండీ ఆదాయం, వివిధ టికెట్స్ ఆదాయం కలిపి మొత్తం 1,15,70,827 రూపాయలు ఆదాయం సమకూరిందని వివరించారు. మిశ్రమ వెండి, బంగారం తిరిగి హుండీలో వేయనైనదిగా పేర్కొన్నారు. ఈ హుండీ ఆదాయ లెక్కింపు దేవాదాయ శాఖ, వరంగల్ డివిజనల్ పరిశీలకులు జి. సంజీవ రెడ్డి పరిశీలనలో కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు పోలీస్ స్టేషన్, హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాష్, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సేవ సమితి సభ్యులు మహబూబాబాద్ వారు, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీలా అమ్మవారు యముని సంహార శక్తి

## - అమ్మవారిని ఆరాధిస్తే మృత్యువు బాధించదు



వరంగల్, జులై 16,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళీ దేవాలయంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు మంగళవారం నాటికి 11వ, రోజుకు చేరుకున్నాయి. దేవాలయ కార్యనిర్వహణ అధికారి, సహాయ కమిషనర్ కే. శేషు భారతి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపిన వివరాల ప్రకారం జ్యోతిశ్శాస్త్రం ప్రకారం దశమీ తిథికి అధిదేవత యముడు. ఈ తిథికి దశమహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి, నీలా అమ్మవారు అధిదేవత ఈమె యముని యొక్క సంహార శక్తి అన్నారు. ఈమెను ఆరాధించిన వారిని మృత్యువు బాధించదని చెప్పారు. ఈమె భక్తులు దీర్ఘమైన ఆయుష్యును కలిగియుంటారని వివరించారు. అనగా ఈతి బాధలు ఈమె భక్తుల దరిచేరవు, ఇహపర సౌఖ్యాలను ఈ నీలా అమ్మవారు ప్రసాదిస్తుందన్నారు. షోడశీ క్రమాన్ని అనుసరించి ఈ రోజుకు అధిదేవత నిత్యా భక్తులకు శాశ్వతమైన ఆనందాన్ని ఈ అమ్మవారు ప్రసాదిస్తుందన్నారు. అందువల్ల ఈ మాతను నిత్యా అని శాస్త్రాలు చెబుతున్నాయని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

# ప్రభుత్వం అందించే వైద్య సేవలు వినియోగించుకోవాలి

## - వరంగల్ డీఎంహెచ్ ఓ డాక్టర్ కే. వెంకటరమణ



### 30 సంవత్సరాల వయస్సు నిండిన వారు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి

వరంగల్, జులై 16,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అనేక సౌకర్యాలు కల్పిస్తుందని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. వెంకటరమణ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో (జూమ్) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే వెంకటరమణ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గర్భిణీ స్త్రీని నమోదు నమోదు చేసుకోవాలన్నారు. వారికి మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించి, వారికి అందించవలసిన ధనుర్వాతా టీకా, ఐరన్ పోలిక్ యాసిడ్ గోళీలు వివిధ పరీక్షలు నిర్వహించి, తగు సేవలు అందించాలన్నారు. వైద్యాధికారిచే పరీక్షలు నిర్వహించి, వారిని మానసికంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించేటట్లు వారి కుటుంబానికి, వారిని మానసికంగా సిద్ధం చేసి, తల్లి,బిడ్డల ఆరోగ్యం బాగుండేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేటట్లు చూడాలని కోరారు. కొంతమందికి అవగాహన లేకపోవడం వలన ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోయి, అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్లు చేయించుకోవడం మానివేయాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు అనవసరమైన అబార్షన్లు, సి సెక్షన్ ఆపరేషన్లు నిర్వహిస్తే వారిపైన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో ప్రతీ ప్రైవేటు హాస్పిటల్ రిజిస్ట్రేషన్ చేసుకొని, వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం వారి ఆసుపత్రులను నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా గర్భిణీ స్త్రీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


జిల్లాలో అసంక్రమిత వ్యాధులు అధిక రక్తపోటు, మధుమేహము, క్యాన్సర్, మెదడుకు సంబంధించిన వ్యాధుల కొరకు 30 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ వైద్య పరీక్షలు చేసుకోవాలని డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వం అందించే ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి అవగాహన లేకుండా ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. ప్రతీ అనారోగ్య సమస్యకు తగిన చికిత్సలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ సెంటర్లో ఉచితంగా అన్ని రకాల పరీక్షలు చేయించుకోవడం వలన వారికి ఉన్న వ్యాధులను సులభంగా గుర్తించవచ్చు అన్నారు. ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకొని ఆరోగ్య తెలంగాణ దిశగా ముందుకు రావాలని తెలిపారు. ప్రతీ పీఎస్సీలో వైద్యాధికారులు అన్ని రకాల సేవలు అందించి, ఉత్తమ ఆరోగ్య కేంద్రాలుగా నమోదు కావడానికి కృషి చేయాలన్నారు. ఎలాంటి వ్యాధులకు గురికాకుండా, ఆశా కార్యకర్త నుండి వైద్యాధికారి వరకు నిరంతరం పర్యవేక్షించి, వారికి అందించవలసిన నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడానికి ఈ సంజీవిని ద్వారా, వెల్నెస్ ఆక్టివిటీస్ ద్వారా, సేవలందిస్తూ, ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మానసికంగా సమస్యలతో బాధపడుతున్న వారికి సైక్రియాటిస్టు డాక్టర్ భరత్ కుమార్ అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఇలాంటి అవకాశాలు అందుబాటులో ఉన్నప్పుడు వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. వాతావరణ మార్పుల వలన అంటు వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడు వాపు, రక్త విరోచనాలు, నీళ్ల విరోచనాలు, కలరా మొదలగు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతీ ఆశా కార్యకర్త గృహ సందర్శన చేసి, రోజు వారిగా చికిత్సలు అందించాలని తెలిపారు. ఏ గ్రామంలోనైతే అధికంగా జ్వరాలు వ్యాపించాయని తెలిసిన వెంటనే అక్కడ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ గోపాలరావు, డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారిని డాక్టర్ పద్మశ్రీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దావకాన వైద్యాధికారులు, సంబంధిత వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ ల సంక్షేమానికి వెయ్యి కోట్లు కేటాయించాలి



రాయపర్తి, జులై 16,(జర్నలిస్ట్ వార్త): ముదిరాజ్ ల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పొన్నం మొగిలి, ముదిరాజ్ ఎన్నారై రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్ స్టాండ్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసిల్దార్ ఎం శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ లను బిసిడి నుండి బీసీఏ లోకి మార్చాలని అన్నారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్ లు ఎన్నో ఏళ్లుగా వెనుకబడి ఉన్నారని అన్నారు. ముదిరాజ్ ల అభివృద్ధికి వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేసి, 75 శాతం సబ్సిడీతో సంక్షేమ పథకాలను చేపట్టాలని ఉన్నారు. చెరువులు, కుంటల పై ముదిరాజ్ గంగ పుత్రులకు హక్కులు ఉండే విధంగా చట్టపరమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చోప్పం సోమయ్య, జిల్లా డైరెక్టర్ చెవ్వ కాశీనాదం, బండారి శ్రీనివాస్, ముద్రపోయిన సుధాకర్, ముద్రబోయిన వెంకన్న, జంగిలి నరేష్, చెవ్వ యాకయ్య, బోయిని కుమార్, షాపురం సాయిలు, బిమని యాదగిరి, పిట్టల వెంకటయ్య, నారాబోయిన యాకయ్య, వెంకన్న, రామ్మూర్తి, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ చేయూత



రాయపర్తి, జులై 16,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ఇలబేల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని కాట్రపెల్లి మాజీ సర్పంచ్ భువనగిరి ఎల్లయ్య పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం, వేయి రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి చేయుతనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ సహాయ, సహకారాలు అందించడంలో తాను ముందుంటానని తెలిపారు. వారి వెంట మొర్రి రాజేందర్, డాక్టర్ శ్రీను, డాక్టర్ అజిత్, బూడిద సోమయ్య, ఇలబెల్లీ అనిల్, బూడిద యాకయ్య, బూడిద సోమయ్య, దేవానందం తదితరులు ఉన్నారు.

